## సంపాదకీయం

# నిస్పృహకు చోటివ్వద్దు

మా రెండవ బులెటిన్ వెలువడిన తరువాత జరిగిన ఘటనలనూ సంభవించిన పరిణామాలనూ సమీక్షించుకుంటే పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పురుషోత్తం, నల్గొండ జిల్లా శాఖ కార్యదర్శి ఆజం అలీల హత్యల మీద ప్రధానంగా దృష్టి నిలుస్తుంది.

తాను నమ్మిన పౌరహక్కుల ఉద్యమ నిర్మాణం కోసం పురుషోత్తం చేసిన నిర్విరామకృషి, తన విశ్వాసాలకు కార్యరూపం ఇవ్వడంలో ప్రాణహానికి వెరవని అతని తెగింపు అసాధారణమైనవి. అతనినీ, ఆజం అలీనీ పోలీసుల రక్షణలో ఉన్న కిరాయి హంతకులు పట్టపగలు అతిక్రూరంగా హతమార్చిన వైనం కూడా అసాధారణమైనదే.

సామాజిక జీవితంలోని భిన్న ప్రయోజనాలు, భిన్న లక్ష్యాల మధ్య వైరుధ్యం మన కళ్ల ముందే రోజురోజుకూ మరింత హింసాత్మక రూపం తీసుకుంటున్నది. అందులో బలవంతులైన వారు మరింత నగ్నంగానూ మరింత క్రూరంగానూ హింసకు పాల్పడుతున్నారు. అది ఒక హక్కయినట్టు వారు ప్రవర్తిస్తుంటే ప్రజలు మౌనంగా చూస్తున్నారు. ఆ హింసలోని క్రూరత్వం పెరిగే కొద్దీ ప్రేక్షకుల మౌనం కూడా పెరుగుతుంది. రాష్ట్రరాజధానిలో మధ్యతరగతి నివాసాల మధ్య పురుషోత్తంను పట్టపగలు తల తెగనరికి చంపడం అటువంటి ఒక భయంకర దృశ్యం. నల్గొండ పట్టణంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా పురుషోత్తం సంస్మరణ సభ జరుపుకుంటున్న హాలు బయట రోడ్డు మీద ఆజంను నరికి చంపడం మరో భయంకర దృశ్యం.

వాళ్లు ఇంత చేయగలిగినప్పుడు ఇంక చేయలేనిదేముంది? ఇంక ఎవరైనా కూడా న్యాయాన్ని గురించి, హక్కుల గురించి మాట్లాడి సాధించేది ఏముంది? మాట్లాడేవాళ్లు ఏ రోజైనా ఏ రకంగానయినా చావవచ్చు. పోలీసులతో చెట్టపట్టాలు వేసుకొని తిరిగే హంతకులు బహిరంగంగా సంచరిస్తున్న చోట మనం తీసుకోగల 'జాగ్రత్తలు' అంటూ ఏమీ ఉండవు.

నిస్పృహ నిండిన ఈ ఆలోచనలకు మనం సులభంగా లోనయ్యే ప్రమాదం ఉంది. ఆ పైన ఏమి చేసినా ప్రయోజనం లేదనో, లేక ఈ క్రూరత్వాన్ని ఎదుర్కోవడానికి అంతటి క్రూరత్వానికి మనమూ సిద్ధపడితేనే ప్రయోజనం ఉంటుందనో నిర్ధారించుకోవడం ఇంకొక్కడుగు మాత్రమే.

పురుషోత్తంను, ఆజంను చంపినవాళ్లకూ చంపించిన వాళ్లకూ ఆ హంతకుల సంరక్షకులకూ

కావలసింది అదే.

ఈ ఎనిమిది నెలల కాలంలో జరిగిన ఇతర పరిణామాలను చూస్తే మన నిస్పృహ వారికెందుకవసరమో అర్థం అవుతుంది. ఆర్థిక 'సంస్కరణల' దుష్ప్రభావాలు ఒక్కొక్కటిగా ప్రజలపైన పడుతున్నాయి. ప్రజలకర్థమవుతున్నాయి. 'అభివృద్ధి' నిర్వచనం నుండి ప్రజలను తొలగించి పెట్టుబడి సమీకరణనూ పెరుగుదల రేటునూ సర్వప్రమాణాలుగా భావించే పాలనా విధానాలు న్యాయస్థానాల ఆమోదముద్ర పొందుతున్నాయి. ఆ విధానాలు అన్యాయమైనవంటూ కోర్టుకుపోయిన వారిని 'మీరు ప్రజల కోసం కేసు వేస్తున్నారా? ప్రచారం కోసం వేస్తున్నారా?' అని దేశ ప్రధానన్యాయమూర్తి ఈసడింపుగా అడుగుతున్నారు. 'నీకు చట్టంలో స్పష్టంగా రాసి ఉన్న హక్కు ఏదయినా పోతేనే కోర్టుకురా- లేకపోతే రావద్దు' అని మన హైకోర్టు నుండి కర్నాటకకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయి వెళ్లిన జస్టిస్ వెంకట్రామిరెడ్డి అంటున్నారు.

ఈ 'అభివృద్ధి'కి రెండవ ధృవం నిర్వాసితులు. భౌతికంగా నిర్వాసితులయ్యే ప్రజల విషయం 'నర్మదా కేసు' సందర్భంగా బాగానే చర్చకు వచ్చింది. అంతకంటె తక్కువ స్థాయిలోనయినప్పటికీ అంతే సంపూర్ణంగా ప్రజలను నిర్వాసితులు చేసే ప్రయత్నాలు మన రాష్ట్రంలో హైదరాబాద్, గుంటూరు వంటి పట్టణప్రాంతాలలో మొదలయ్యాయి. నర్మదా డ్యాంకయినా సౌరాష్ట్రలోని కరువు ప్రాంతాలకు నీరందించడం అనే పాజిటివ్ లక్ష్యం ఉందేమోగానీ పట్టణాల సుందరీకరణకు అటువంటి లక్ష్యం కూడా ఏదీ లేదు.

ఒక పట్టణం నడిబొడ్డున ఒక ఎకరం ప్రభుత్వ భూమి ఉందనుకోండి. అందులో ఒక్కొక్కరు మూడు సెంట్ల భూమిలో గుడిసెలేసుకొని- రోడ్లకు, కాలవలకు, అంగళ్లకు కొంచెం చోటు మిగిలించి- ముప్పయి కుటుంబాలు నివసిస్తున్నాయనుకోండి. ఖరీదయిన ఆ భూమిలో వాళ్లను ఉండనిస్తే రాష్ట్రానికి ఏమొస్తుంది? వాళ్లు అక్కడున్నా వేరే ఎక్కడున్నా చేసే కూలి చేస్తారు. రాష్ట్ర ఆదాయానికి చేర్చే సంపద చేరుస్తారు. దానికి వారు నగరం నడిబొడ్డున ఎందుకుండాలి? దూరం వెళ్లిపోవడం వల్ల వారి దినసరి ఖర్చులు పెరగవచ్చు, వారిప్పుడు చేస్తున్న పని కోల్పోయి కొత్తది వెతుక్కోవలసి రావచ్చు. అది వారి తలనొప్పి. వారు కొత్తది వెతుక్కోకమానరు, ఖర్చులు పెరిగి జీవనం దెబ్బతిన్నా 'రాష్ట్ర ఆదాయానికి' ఎప్పటిలాగే అంతే సంపద చేర్చకమానరు. కానీ వారిని పట్టణం నడిబొడ్డు నుండి బయటికి తరిమేసి ఆ ఎకరం జాగాను పర్యాటక అభివృద్ధికి కేటాయిస్తే 'రాష్ట్ర ఆదాయం' పెరుగుతుంది, ఇరవై ఏళ్లలో 10 శాతం పెరుగుదల రేటు సాధించాలన్న చంద్రబాబు నమూనా లక్ష్యానికి రాష్ట్రం ఇంకొంచెం చేరువ అవుతుంది.

భౌతికంగా నిర్వాసితులయ్యేవారి సమస్య కొంచెం ప్రయత్నం చేస్తే అర్థమయినా అవుతుంది. కానీ ఒక జీవనమార్గం నుండి, కనీస భద్రత నుండి, అభివృద్ధి అవకాశాల నుండి 'నిర్వాసితులు' అయ్యేవారూ ఉన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ఆర్థిక క్రమశిక్షణ పేరిట నీరసింపజేసే కొద్దీ ఆహార భద్రతకు దూరమయ్యేవారి సంఖ్య పెరుగుతున్నది.ఎఫ్‌సిఐ గోడవున్లు పట్టనంతగా ఆహారధాన్యాల నిల్వలు పెరుగుతున్నాయిగానీ పేదలు వాటి లభ్యత నుండి 'నిర్వాసితులు' అవుతున్నారు. గ్లోబలైజేషన్ వ్యవసాయరంగంలోకి ప్రవేశించాక రైతాంగం జీవితాలలో అస్థిరత, అభద్రత చాలా పెరుగుతున్నాయి. కార్పొరేట్ వ్యవసాయం దీనికి తట్టుకుని వర్ధిల్లుతుందేమోగానీ రైతులు- అందులోనూ కరువుప్రాంతాల రైతులు- తట్టుకోలేరు. కరువుకు ఏ పరిష్కారమూ ఈ వ్యవసాయ వ్యూహంలో లేదు. అస్థిరతే దీని లక్షణం కాబట్టి దానికి విరుగుడు ఎట్లాగూ లేదు. పెరుగుతున్న రైతాంగం ఆత్మహత్యల జాబితాలో ఈ పరిస్థితి ప్రతిబింబం కనిపిస్తుంది. భద్రత నుండి

'నిర్వాసితుల'యిన రైతాంగం జీవితానికే వెలి అవుతున్నారు. రేపు చంద్రబాబు కుటిల యత్నాలు ఫలించి ఏజెన్సీలో ఖనిజాల కార్పొరేషన్లకు నెలవు దొరికితే ఆదివాసులకు ఇంతకంటే చాలా వేగంగా ఇదే గతి పట్టే ప్రమాదం ఉంది.

ప్రజలను భౌతికంగా నిస్సహాయులను చేస్తున్న ఈ పరిస్థితిలో వారు మానసికంగా కూడా నిస్పృహకు లోనయినట్లయితే ఇంక దీనికి పరిష్కారం దొరకదు. పాలనా వ్యవస్థ అన్ని నియమాలనూ పక్కనబెట్టి విచ్చలవిడిగా వ్యవహరించడం ఈ నిస్పృహ పెరగడానికి తోడ్పడుతుంది. ఈ నిస్పృహను పెంచడం దాని లక్ష్యాలలో ఒకటి. ప్రభుత్వం ప్రైవేట్ హంతకముఠాలను చేరదీయడం, పోలీసులు జైలు నుండి కోర్టుకు తీసుకుపోతున్న ముద్దాయిలను దారిలోనే కాల్చిపారేయడం, దోషినీ నిర్దోషినీ వేరు చేయగల సున్నితత్వాన్ని నేర స్మృతి నుండి వెలివేయడం- ఇదంతా కేవలం రాశిలో మాత్రమే కాదు, గుణంలోనూ చాలా పెరిగిన నిర్బంధం. గుణంలోని తేడాలో ప్రధాన విషయం ప్రజలలో అది పెంచే మానసిక దుర్బలత, నిస్సహాయత. ప్రస్తుత పాలనా విధానాలకు ఇదే కావాలి.

ఆ నిస్సహాయతను అధిగమించడానికి కావలసిన దృఢసంకల్పాన్నీ మానసిక స్థైర్యాన్నీ పురుషోత్తం నుండి ఉద్యమాలూ ఉద్యమకారులూ ప్రజలూ నేర్చుకోగలిగితే అతని మరణం వృధా కానట్టే. ఆ సంకల్పం ఏ రకమైన ఉద్యమ ఆచరణకు దారి తీస్తుందనే విషయంలో ఉద్యమాల మధ్య, ఉద్యమకారుల మధ్య ఎన్ని అభిప్రాయభేదాలయినా ఉండవచ్చుగాక- అది వేరే విషయం.

మానవ హక్కుల వేదిక

20.2.2001